సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 24 । ఆగస్టు । 2023



దివ్యాంగులకు మరింత ఆసరా
రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆసరా పింఛన్ పెంచి ఆదుకుంటుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.
- 10లో▸



బది'లీలలు'
- 10లో▸
సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆశీర్వాదంతో నచ్చిన దగ్గర పోస్టింగ్ పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గరిష్ఠం/కనిష్ఠం
$31^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
న్యూశాయంపేట: విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే మైనార్టీ అభ్యర్థుల నుంచి సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా అందించే ఆర్థికసాయానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, పోస్ట్ డాక్టరోల్ స్టడీస్ కోసం అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లో జనవరి నుంచి జూన్–23 స్ప్రింగ్ సీజన్‌లో అడ్మిషన్ తీసుకున్న అర్హత కలిగిన అభ్యర్థులు www.telanganaepass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 21 వరకు గడువు ఉన్నట్లు మేన శ్రీను పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సుబేదారిలోని కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగ బాధ్యత సక్రమంగా నిర్వర్తించండి



హన్మకొండ అర్బన్: ఉద్యోగ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ కారుణ్య నియామక అభ్యర్థులకు సూచించారు. బుధవారం 33 మంది అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ అందించారు. వీరిలో స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో 20, కాలేజియేట్ ఎడ్యుకేషన్ 2, ఐఅండ్‌సీఏడీ 1, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ 4, పంచాయతీరాజ్ 3, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ 1, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో 2 జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు నిర్వర్తించనున్నారు. నియామక పత్రాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ ఇర్ఫాన్ సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సైన్స్ టీచర్లకు ఓరియంటేషన్
విద్యారణ్యపురి: జిల్లాలోని అన్ని పాఠశాలల (6 నుంచి పదో తరగతి) సైన్స్ ఉపాధ్యాయులకు గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి, ఎస్‌సీఈఆర్టీ జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్ట్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులను సంసిద్ధం చేసేందుకు టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల నుంచి ఒక సైన్స్ ఉపాధ్యాయుడిని పంపాలని ఆదేశించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణలో 2023–24 సంవత్సరానికిగాను ఎస్‌సీఈఆర్టీలో ప్రదర్శించే వాటిపై అవగాహన కల్పించనున్నట్లు వారు తెలిపారు. 'ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' ప్రధానాంశంగా శిక్షణ ఇవ్వనున్నట్లు, ప్రాజెక్టులు రూపొందించే విధానం, టైమ్ టేబుల్, నిబంధనలపై అవగాహన కల్పించనున్నట్లు వారు తెలిపారు.

9 మంది డీబార్
కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బుధవారం నిర్వహించిన దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ సెకండియర్ పరీక్షల్లో రెండు పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ.. 9 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. జనగామ ఏబీవీ ప్రభుత్వ కళాశాలలో ఆరుగురు, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు మొత్తం 9 మంది డీబార్ అయినట్లు వారు తెలిపారు. 3,058 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా.. 2,174 మంది హాజరయ్యారు.

న్యాయవాది రాంగోపాల్‌రావు సస్పెన్షన్
వరంగల్ లీగల్: వృత్తిపరమైన దుష్ప్రవర్తన కారణంగా సీనియర్ న్యాయవాది ఆర్.రాంగోపాల్‌రావును ఐదేళ్లు సస్పెండ్ చేస్తూ జాతీయ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ కమిటీ నిర్ణయించింది. దీనిని ధ్రువీకరిస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ సంబంధిత ఉత్తర్వులను అన్ని జిల్లాల ప్రధాన న్యాయమూర్తులకు పంపించింది. వరంగల్ నాలుగో అదనపు జిల్లా కోర్టులో విచారణలో ఉన్న సివిల్ కేసులో కోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. కాగా.. 2010 మార్చి 22న అడ్వకేట్ కమిషనర్ ఎదుట విచా రణ జరుగుతున్న ప్రతివాది న్యాయవాది అయిన పి.కృష్ణారెడ్డిపై సీనియర్ న్యాయవాది ఫిర్యాదు పక్ష న్యాయవాదైన ఆర్.రాంగోపాల్‌రావు దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నారు. దీనిపై కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు రాష్ట్ర, జాతీయ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ కమిటీ విచారించి రాంగోపాల్‌రావును ఐదేళ్ల వరకు సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. 2022 నవంబర్ 5 నుంచి వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

జాబిలి చెంతకు చేరగా..
త్రినగరి మురవగా!



చంద్రయాన్‌-3ని వీక్షించిన నగరవాసులు
- రీజినల్ సైన్స్ సెంటర్‌లో లైవ్ టెలీకాస్ట్
- సాయంత్రం నుంచి టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు
- ప్రజ్ఞాన్ రోవర్‌ను సాఫ్ట్ ల్యాండ్ చేసే సమయంలో తీవ్ర ఉత్కంఠ..
- చంద్రుడిపై విక్రమ్‌ల్యాండర్ దిగగానే ఆనందంతో కేరింతలు..
- జాతీయ జెండాలు చేతబూని సంబురాలు



హసన్‌పర్తి: సుజాత పాఠశాల విద్యార్థుల సంబురాలు

కాజీపేట అర్బన్: చందమామపై ప్రజ్ఞాన్ రోవర్‌ను తీసుకెళ్లిన విక్రమ్ బుధవారం సాయంత్రం 6.04 నిమిషాలకు సేఫ్టీగా ల్యాండ్ అవగానే కాజీపేట, వరంగల్, హనుమకొండలో జయహో భారత్ అంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా కేరింతలు కొట్టారు. త్రివర్ణపతాకాలు చేతబూని ర్యాలీలు తీశారు. బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు.



నిట్‌లో చంద్రయాన్‌-3 వీక్షిస్తున్న విద్యార్థులు

నిట్‌లో సంబురాలు
నిట్ వరంగల్‌లోని ఆడిటోరియంలో బుధవారం చంద్రయాన్–3 లాంచింగ్‌ను లైవ్‌గా వీక్షించారు. ప్రయోగం విజయవంతం కాగానే విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. తాము సైతం సైంటిస్టులుగా రాణిస్తామని, చంద్రయాన్–3 స్ఫూర్తినిచ్చిందంటూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యాకేతన్ పాఠశాల విద్యార్థులు వీధుల్లో జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. కాజీపేట జంక్షన్ ఎదుట తెలంగాణ రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో జయహో భారత్, జయహో భారతీయ శాస్త్రవేత్తలు అంటూ బాణసంచా కాల్చారు. త్రివర్ణ పతాకాలు చేతబూని నినాదాలు చేశారు.



ఉర్వి అంతా..
ఉర్వి అంతా.. ఊపిరి బిగబట్టి చూస్తున్న వేళ
లక్షల కిలోమీటర్లు పయనించిన
చంద్రయాన్ మూడు.. జాగ్రత్తగా నడుస్తూ..
చందమామపై అడుగిడి.. మువ్వన్నెల జెండాను
జాబిల్లి ఎదపై ఎగరేసింది
గగనతలంలో భరతమాతకు
తిరుగులేదని చాటిచెప్పింది.

- వల్స పైడి, ఉపాధ్యాయుడు



సైన్స్ సెంటర్‌లో లైవ్ వీక్షణ..



చంద్రయాన్–3ని పాఠశాలల్లోనే ప్రసారం చేయాలని మొదట నిర్ణయించినా.. సాయంత్రం 6గంటలు దాటిన తర్వాత ఉండడంతో వాయిదా వేశారు. అయినా కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలు ఉండి ప్రత్యక్ష ప్రసారం చూశారు. అదేవిధంగా రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏ ఇంట్లో చూసినా పిల్లలు, పెద్దలు టీవీలకు అతుక్కుపోయారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్ ప్రాజెక్టు ఆఫీసర్లు రాకేశ్, వెంకటేశ్వర్‌రావు చంద్రయాన్–3 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రొజెక్టర్ ఏర్పాటు చేశారు. నగర ప్రజలు సైన్స్ సెంటర్‌లో చంద్రయాన్–3 లాంచింగ్‌ను లైవ్‌గా వీక్షించేందుకు ఆసక్తి కనబర్చారు. బుధవారం సాయంత్రం 5.44 గంటల నుంచి 6.04 గంటల వరకు కొనసాగిన లైవ్‌ను విద్యార్థులు వీక్షించారు. అంతకుముందు చంద్రయాన్–3 వివరాలను శాస్త్రవేత్తలు వారికి వివరించారు. ప్రయోగం విజయవంతం కావడంతో భారత్ మాతాకీ జై, భారతీయ శాస్త్రవేత్తలకు జై అంటూ సైన్స్‌సెంటర్ నిర్వాహకులు, సిబ్బంది జాతీయ జెండాతో సంబరాలు జరుపుకున్నారు.

చంద్రయాన్‌-3లో మన శాస్త్రవేత్తలు



గొట్టిముక్కుల ప్రవీణ్ రెడ్డి, సుష్మ

హన్మకొండ: చంద్రయాన్–3 విజయవంతంలో హనుమకొండ జంట భాగస్వామ్యం ఉంది. నగరంలోని అశోక కాలనీకి చెందిన గొట్టిముక్కుల ప్రవీణ్‌రెడ్డి, సుష్మ దంపతులు ఇస్రోలో శాస్త్రవేత్తలుగా పనిచేస్తున్నారు. అశోక కాలనీకి చెందిన గొట్టిముక్కుల రమాదేవి, మన్మథరెడ్డి దంపతుల కుమారుడు ప్రవీణ్‌రెడ్డి 2011 సెప్టెంబర్ 16నుంచి బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. మూడు పదోన్నతులు పొంది ప్రస్తుతం డైరెక్టర్ హోదాలో ఉన్నారు. ఆయన సతీమణి సుష్మ కూడా ఇస్రోలోనే శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. విక్రమ్ రోవర్ చంద్రుడిపై అడుగిడడంలో ఇతర శాస్త్రవేత్తలతో కలిసి వీరు పాలు పంచుకున్నారు. విక్రం ల్యాండర్ చంద్రుడిపై విజయవంతంగా దిగగానే తన కోడలు ఫోన్ చేసి విజయవంతంగా ల్యాండ్ అయిందని, ఎంతో సంతోషంగా ఉందని చెప్పిందని మామ గొట్టిముక్కుల మన్మథరెడ్డి తెలిపారు. మన్మథ రెడ్డి పోలీస్‌శాఖ ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా రిటైరయ్యారు.



భూక్య రమేష్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం సోమ్లతండా గ్రామానికి చెందిన భూక్య రమేష్ ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రయాన్–3 ప్రయోగం సందర్భంగా ఇస్రోలోని ప్రధాన శాస్త్రవేత్తలతో కలిసి రమేష్ కూడా పాల్గొన్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన భూక్య భీముడు, లక్ష్మి దంపతుల మూడవ కుమారుడు అయిన రమేష్ ఇస్రోలో నాలుగేళ్లుగా కమ్యూనికేషన్ విభాగంలో పని చేస్తున్నారు. చంద్రయాన్ 2, చంద్రయాన్ 3 ప్రయోగం సమయంలో ఇక్కడే ఉండడం తనకు ఎంతో గర్వంగా ఉందని రమేష్ చెప్పారు. ఈసారి విజయవంతం కావడం భారత దేశ ప్రజల గొప్పతనమని పేర్కొన్నారు.



కేజీబీవీల్లో..
విద్యారణ్యపురి: కేజీబీవీల్లో కేయాన్ (ప్రొజెక్టర్)లో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసి చంద్రయాన్–3ని విద్యార్థినులకు చూపించారు. చంద్రుడిపై విక్రమ్ లాండర్ విజయవంతంగా అడుగిడిన క్షణాల్లో విద్యార్థులు, టీచర్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉన్నతి కార్యక్రమంపై జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలకు శిక్షణ కొనసాగుతోంది. ఈశిక్షణ కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రొజెక్టర్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని డీఈఓ అబ్దుల్‌హై హెచ్‌ఎంలు వీక్షించారు. చంద్రయాన్ విజయవంతం వీడియోలను గురువారం హైస్కూల్ స్థాయి విద్యార్థులకు చూపించాలని, దాని గురించి కూడా తెలియజేయాలని హెచ్‌ఎంలను ఆదేశించినట్లు డీఈఓ తెలిపారు.

ప్రముఖుల స్పందనలు..

చంద్రుడిపై అడుగు అద్భుత విజయం
పాలకుర్తి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన మూన్ మిషన్ చంద్రయాన్–3 విజయవంతం కావడం చరిత్రలో అద్భుత విజయం. ల్యాండర్ విక్రమ్ చంద్రుడిపై దిగిన క్షణాలు ఉత్కంఠకు లోనయ్యాను. ఇది సాధించిన శాస్త్రవేత్తలకు అభినందనలు.
- రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు

అవధుల్లేని ఆనందం కలిగించింది
హన్మకొండ: చంద్రయాన్–3 విజయవంతం అవధుల్లేని ఆనందాన్ని కలిగించింది. మన దేశం చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత ఘట్టం భారతీయులుగా గర్వించదగినది.
- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలించింది
హన్మకొండ: చంద్రయాన్ విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలించింది. తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారత దేశం విక్రమ్ ల్యాండర్ దింపి నవశకానికి నాంది పలికింది. ఈ అద్భుతమైన విజయానికి కారకులైన ఇస్రో శాస్త్రవేత్తలకు హృదయపూర్వక అభినందనలు.
- రావు పద్మ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

దేశానికి దక్కిన అతిపెద్ద గౌరవం



విద్యార్థులు ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తిగా అధ్యయనం చేయడం వల్ల నూతన ఆలోచనలకు నాంది పలికే అవకాశం ఉంటుంది. భారతీయ శాస్త్రవేత్తల స్ఫూర్తికి నిదర్శనమే చంద్రయాన్–3. దేశానికి దక్కిన అతిపెద్ద గౌరవం.
- డాక్టర్ భరత్, సీసీఎంబీ, సైంటిస్ట్

ఆసక్తిగా వీక్షించా..



సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చంద్రయాన్–3ని లైవ్‌గా వీక్షించడం చాలా బాగుంది. సైంటిస్టులు చంద్రయాన్–3ని ఆకాశంలోకి పంపించేందుకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేయడం ఎంతో ఆసక్తి రేకెత్తించింది. నేను కూడా శాస్త్రవేత్తగా పరిశోధనలు చేపడతా.
- తేజ, 8వ తరగతి, ఎస్సార్ స్కూల్

మరిచిపోలేని అనుభూతి..



చంద్రుడిపై రోవర్ దిగిన క్షణాలను ప్రత్యక్ష ప్రసారం చూడడం మరిచిపోలేని అనుభూతి. స్పేస్‌లోకి చంద్రయాన్–3ను ఇస్రో సైంటిస్ట్ పంపించడమే ఒక అద్భుతం. సైన్స్‌పై ఆసక్తిని పెంచుకుని సైంటిస్ట్‌గా ఇస్రోలో చేరాలని ఉంది.
- అంజలి, 7వ తరగతి, కేంద్రీయ విద్యాలయం

ఉత్కంఠగా ఎదురుచూశా..



చంద్రుడిపై విక్రమ్ రోవర్ ల్యాండింగ్ చూపేందుకు సైన్స్ సెంటర్‌లో ప్రత్యేక ప్రొజెక్టర్ ఏర్పాటు చేయడం బాగుంది. ల్యాండింగ్‌కు ముందు సైంటిస్ట్‌ల కౌంట్ డౌన్ చేపట్టడం.. చందమామపై రోవర్ దిగగానే కేరింతలు కొట్టా.
- మైత్రి, 8వ తరగతి, కేంబ్రిడ్జి హైస్కూల్

సైంటిస్టులకు సెల్యూట్



పరిశోధనలు చేపట్టేందుకు ఇస్రో సైంటిస్టులు ఎంతో శ్రమించి ప్రయోగించిన చంద్రయాన్–3 ద్వారా చందమామ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని ఉంది. బుధవారం లాంచింగ్‌ను ఎంతో ఆసక్తితో వీక్షించా. దేశ కీర్తి ప్రతిష్ఠను చాటిచెప్పిన సైంటిస్ట్‌లకు సెల్యూట్ చేస్తున్నా.
- గ్రంధన, ఇంటర్, బన్సల్ కళాశాల

'ఉన్నతి'ని సమర్థంగా అమలు చేయండి
హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, పక్కన డీఈఓ ఎండీ అబ్దుల్‌హై

విద్యారణ్యపురి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఉన్నతి' కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రధానోపాధ్యాయులను కోరారు. బుధవారం హనుమకొండలోని స్కిల్‌స్టార్క్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 'ఉన్నతి'పై కొనసాగుతున్న శిక్షణను ఆమె సందర్శించి మాట్లాడారు. శిక్షణలో ప్రధానోపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో ఉపయోగించి విద్యార్థులు లక్ష్యాలు చేరుకునేట్లుగా చూడాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. డీఈఓ అబ్దుల్ హై మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు బోధనను ఆకర్షణీయంగా మలిచేందుకు ఉపాధ్యాయులకు తగు సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ అనుపురావు, జిల్లా రిసోర్స్‌పర్సన్లు రామకృష్ణ పట్టాభి వేణు ఆనంద్, మనోహర్ నాయక్ హనుమకొండ మండల విద్యాశాఖ అధికారి రామకిషన్‌రాజు, రిసోర్స్‌పర్సన్లు మధుసూదన్‌రెడ్డి, జ్ఞానేశ్వరి, సంపత్, నరేందర్‌రెడ్డి, సంపత్, మహేశ్, గౌస్ పాషా తదితరులున్నారు.

హెచ్‌ఎంలకు క్విజ్ పోటీలు
మూడ్రోజులపాటు నిర్వహించిన ఉన్నతి కార్యక్రమ శిక్షణకు సంబంధించిన అంశాలపై డీఈఓ అబ్దుల్‌హై ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు క్విజ్ పోటీ నిర్వహించారు. ఆన్లైన్ ద్వారా నిర్వహించిన ఈపోటీలో ప్రధానోపాధ్యాయులు ప్రతిభ కనబరిచారని, ఈ విజ్ఞానాన్ని విద్యార్థుల శ్రేయస్సు కోసం ఉపయోగించాలని డీఈఓ కోరారు.

సామర్థ్యాలను పెంపొందించాలి: వాసంతి



మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

కాశీబుగ్గ సెంటర్ : పాఠశాలల్లోని అన్ని వనరులను ఉపయోగించుకుని ఉన్నతి కార్యక్రమాన్ని అమలుచేసి పిల్లల్లో సామర్థ్యాలను పెంపొందించాలని వరంగల్ డీఈఓ డి.వాసంతి హెచ్‌ఎంలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. డీఈఓ వాసంతి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు శిక్షణ నేర్చుకున్న అంశాలతో విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.సారయ్య, కోర్సు కోఆర్డినేటర్, డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి, రిసోర్స్ పర్సన్స్ కట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలి




వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పనిచేయని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. లింగ వ్యత్యాసం ఉన్న మండలాలను గుర్తించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు మాట్లాడుతూ.. జిల్లాలో లింగ వ్యత్యాసం ఉన్న మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి సహకరిస్తామని తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ గోపాల్‌రావు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, సీసీఆర్‌బీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం దరఖాస్తులు చేసుకున్న స్కానింగ్ సెంటర్లకు అప్రూవ్ చేశారు.

పారిశుద్ధ్య విధానాలు భేష్!

- నేపాల్, బంగ్లాదేశ్, మాల్దీవ్స్ ప్రతినిధుల కితాబు
- క్షేత్రస్థాయిలో పరిశీలన



శానిటేషన్ విధానాలను వివరిస్తున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: 'నగరంలో అవలంభిస్తున్న పారిశుద్ధ్య విధానాలు చాలా బాగున్నాయి' అని నేపాల్, బంగ్లాదేశ్, మాల్దీవ్స్ దేశాల ప్రతినిధులు కితాబిచ్చారు. బుధవారం బల్దియా పరిధిలో ఆయా దేశాలకు చెందిన 20 మంది ప్రతినిధులు, అధికారుల బృందం పర్యటించింది. నగరంలోని స్థితిగతులను బృందసభ్యులు అధ్యయనం చేశారు. శానిటేషన్‌లో బల్దియా అమలు చేస్తున్న పద్ధతుల అధ్యయనానికి వడ్డేపల్లిలోని పబ్లిక్ టాయిలెట్, అమ్మవారిపేటలోని రెండు ఎఫ్ఎస్టీపీలు, ఎంజీఎం ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఎస్టీపీ, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని షీ టాయిలెట్లలో అమలు చేస్తున్న పద్ధతులను బృందం పర్యవేక్షించింది. స్లడ్జింగ్, డీ స్లడ్జింగ్ విధానాలు, వ్యక్తిగత మరుగుదొడ్లను బృంద సభ్యులు పరిశీలించి వాటి నిర్మాణ తీరును తెలుసుకున్నారు. అనంతరం 'కుడా'లో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను ఆయా దేశాల ప్రతినిధులు కలిశారు. ఈసందర్భంగా వారికి మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ బాషా జ్ఞాపికను అందించారు. మహానగరంలో అమలు చేస్తున్న అధునాతన శానిటేషన్ పద్ధతులను మేయర్ సుధారాణి వారికి వివరించారు. ఇక్కడ భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ లేదని, పూర్తిగా ఆన్–సైట్ పారిశుద్ధ్యంపై ఆధారపడుతున్నట్లు ఆమె తెలిపారు. శానిటేషన్, బయోమైనింగ్, వాహనాలకు జీపీఎస్, ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానాల్ని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వివరించారు. బల్దియాలో అమలు చేస్తున్న విధానాలపై డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ రాజేశ్, ఆస్కి ప్రతినిధులు రాజ్‌మోహన్, అవినాశ్, ఓం ప్రకాశ్, నేపాల్, బంగ్లాదేశ్, మాల్దీవ్స్ ప్రతినిధులున్నారు.

పనుల్లో వేగం పెంచండి
గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం నూతన సమావేశ భవనంలోని మొదటి అంతస్తులో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్ని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం పరిశీలించారు. భవనం ఫినిషింగ్, యంత్రాల ఇన్‌స్టాలేషన్ తదితర పనులు వేగంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఐసీసీసీలో దశలవారీగా అన్ని కాంపోనెంట్ల ఏర్పాట్లు, నిర్దేశిత గడువులోగా పనులు కావాలన్నారు. ఈసందర్భంగా కొత్త పరిపాలన భవన నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్స్, లైన్లను ఇతర ప్రాంతానికి తరలించడం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, బల్దియా కార్యాలయ వెనుక భాగంలో స్థలాల్ని కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు రాజయ్య, సంజయ్, డీఈ రవికుమార్, ఏఈ శ్రీకాంత్, సంతోశ్, ఎన్‌పీడీసీఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా వివిధ మార్గాలలో ప్రయాణించే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం రద్దు చేశారు. విజయవాడ రూట్‌లో మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన ట్రాఫిక్ కమ్ పవర్ నాన్ ఇంటర్ లాకింగ్ బ్లాక్ చేపట్టిన కారణంగా పలు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేసినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవే..

సంబల్‌పూర్–నాందేడ్ (20809) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 25, 27, 28వ తేదీల్లో, నాందేడ్–సంబల్‌పూర్ (20810) ఎక్స్‌ప్రెస్ 26, 28, 29వ తేదీల్లో, విశాఖపట్నం–నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్ 26,29వ తేదీల్లో, నాందేడ్–విశాఖపట్నం (20812) ఎక్స్‌ప్రెస్ 27,30వ తేదీల్లో రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు.

మోడల్ రైల్వే బంగ్లాలు ప్రారంభం


రైల్వే బంగ్లాలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో అధికారుల కోసం నిర్మించిన మూడు మోడల్ రైల్వే బంగ్లాలను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్ బుధవారం ప్రారంభించారు. బెల్లంపల్లి–కాజీపేట జంక్షన్ తనిఖీలో భాగంగా డీఆర్‌ఎం కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. అనంతరం రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ కాలనీలో మెయిన్‌రోడ్‌లో నిర్మించిన మూడు మోడల్ రైల్వే బంగ్లాలను ప్రారంభించారు. అద్భుత బంగ్లాల నిర్మాణానికి కృషి చేసిన అధికారుల బృందాన్ని అభినందించి రూ.10 వేల క్యాష్ అవార్డు ప్రకటించారు. అనంతరం రైల్వే డ్రైవర్ల కార్యాలయం సమీపంలో ఆన్‌లైన్ డ్రైవర్ల విశ్రాంతి కోసం నిర్మించనున్న మోడల్ రన్నింగ్ రూమ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డీఈఎన్ కో ఆర్డినేషన్ కృష్ణారెడ్డి, సీనియర్ డీఈఈ ఎస్.ఎస్.వి.ప్రసాదరావు, సీనియర్ డీఈఈ నవీన్‌కుమార్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, కాజీపేట డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్, కాజీపేట ఏడీఈఎన్‌లు ఎంఆర్ కె.రాజు, విష్ణు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

బది'లీలలు'

ముడుపులు అందజేసి నచ్చిన చోట పోస్టింగ్
- రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా స్థానచలనం
- ఉమ్మడి వరంగల్ జిల్లా దాటని సబ్ రిజిస్ట్రార్లు
- మ్యూచువల్‌ను తలపిస్తున్న బదిలీలు
- చక్రం తిప్పిన ఉద్యోగ సంఘాల నేతలు



కాజీపేట అర్బన్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు చేపడుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఐజీ, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 స్థాయిలో బది'లీలలు' జరిగాయి. పదేండ్లకు పైబడి ఒకే స్థానంలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం కల్పించేందుకు చేపట్టిన బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆశీర్వాదంతో నచ్చిన దగ్గర పోస్టింగ్ పొందినట్లు రిజిస్ట్రేషన్ శాఖలో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎట్టకేలకు కదిలారు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏండ్లుగా లాంగ్ స్టాండింగ్‌లో విధులు కొనసాగిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు ఎట్టకేలకు బుధవారం వెలువడిన బదిలీలతో కదిలారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా దాటని సబ్‌రిజిస్ట్రార్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో లాంగ్‌స్టాండింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 అధికారులు మల్టీ జోన్–1లో భాగంగా రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. అయితే ఉన్నతాధికారుల అండతో ఉమ్మడి వరంగల్ జిల్లా దాటకుండా తాము ఎంచుకున్న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పోస్టింగ్ సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గ్రేడ్–1,గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు మ్యూచువల్‌ను తలపించాయి. వరంగల్ ఆర్వోలో విధులు నిర్వహిస్తున్న సంపత్‌కుమార్ జనగామ, జనగామలో విధులు నిర్వహిస్తున్న అమ్జద్‌అలీ వరంగల్ ఆర్వో, ములుగు సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహబూబాబాద్, వరంగల్ ఫోర్ట్‌లో విధులు నిర్వహిస్తున్న మసీయుద్దీన్ వరంగల్ రూరల్, వరంగల్ రూరల్‌లో విధులు నిర్వహిస్తున్న సుజాత డీఐజీ కార్యాలయానికి , నర్సంపేటలో విధులు నిర్వహిస్తున్న కార్తీక్ వరంగల్ రూరల్‌కు కేటాయించారు. ఈ విధంగా ఏ అధికారి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా దాటలేదు.

చక్రం తిప్పిన ఉద్యోగ సంఘాల నాయకులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రేడ్–1,గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో ఉద్యోగ సంఘాల నేతలు చక్రం తిప్పి ఉమ్మడి వరంగల్ దాటకుండా అడ్డుపడ్డారని తెలుస్తోందని పలువురు పేర్కొన్నారు. భారీగా బదిలీలు జరుగుతాయనే సమాచారంతో లాంగ్ స్టాండింగ్ గ్రేడ్–1,గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు లాంగ్ లీవ్ పెట్టి హైదరాబాద్‌కు మకాం మార్చి ఉన్నతాధికారుల అధికారుల ఆశీర్వాదం కోసం ఉద్యోగ సంఘాల నేతలతో జతకట్టారు.

బదిలీలు ఇలా...

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డీఐజీ, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్–1,గ్రేడ్–2 అధికారులను బదిలీ చేస్తూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ నవీన్ మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరంగల్ డీఐజీగా – ఎం.సుభాషిణి
మహబూబాబాద్–తస్లీమా మహమ్మద్
జనగామ–టి.సంపత్‌కుమార్
వరంగల్ రూరల్–మసీయుద్దీన్
వరంగల్ ఫోర్ట్– ఏ.కార్తీక్
వరంగల్ ఆర్వో–ఎండీ.అమ్జద్ అలీ
నర్సంపేట– రామ కిశోర్ రెడ్డి
డీఐజీ కార్యాలయం–డి.సుజాత

ఉమ్మడి వరంగల్‌లో లాంగ్ స్టాండింగ్ ఇలా..

గ్రేడ్–1 సబ్ రిజిస్ట్రార్లు..	గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్లు..
ములుగు–13 సంవత్సరాలు	వరంగల్ ఫోర్ట్– 8 ఏళ్లు
వరంగల్ రూరల్–6	నర్సంపేట–8 ఏళ్లు
వరంగల్ ఆర్వో–4	జనగామ–9 ఏళ్లు
డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్–5	

యువతులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ డేవిడ్ రాజు

వరంగల్ క్రైం/హసన్‌పర్తి: షేర్ చాట్, స్నాప్ చాట్ యాప్‌ల ద్వారా యువతులను మోసం చేస్తున్న వ్యక్తిని హసన్‌పర్తి పోలీసులు అరెస్ట్ చేసి ఓ యువతిని కాపాడారని కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా కలమర్ల గ్రామానికి చెందిన ఇమ్రాన్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో షేర్‌చాట్, స్నాప్ చాట్ యాప్‌ల ద్వారా మహిళలు, యువతులతో చాటింగ్ చేయడానికి ప్రణాళికలు రచించాడు. ఇందులో భాగంగా హసన్‌పర్తి మండలానికి చెందిన ఓ యువతితో రెండు నెలల క్రితం షేర్ చాట్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. ఆ తరువాత వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుతూ తాను ధనవంతుడినని, తన వద్దకు వస్తే ఇద్దరం కలిసి ఉందామని నమ్మించాడు. దీంతో సదురు యువతి ఈనెల 8వ తేదీన బంగారం తీసుకుని నిందితుడితో కలిసి జీవించేందుకు సత్యసాయి జిల్లాకు వెళ్లింది. అనంతరం ఆ బంగారాన్ని నిందితుడు ఓ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి రూ.1.50 లక్షల తన ఖాతాలోకి మళ్లించున్నాడు. ఇదిలా ఉండగా సదురు యువతి కుటుంబీకులు ఆమె అదృశ్యమైందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న హసన్‌పర్తి పోలీసులు ఆధునిక టెక్నాలజీ ద్వారా యువతిని పట్టుకున్నారు. బుధవారం రైలులో కాజీపేట మీదుగా విజయవాడకు వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితుడితో పాటు సదరు యువతిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితుడు నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ డేవిడ్‌రాజు తెలిపారు. అనంతరం పోలీసులు యువతిని కుటుంబీకులకు అప్పగించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

నెల్లికుదురు: హత్యాయత్నం కేసులో నిందితుడికి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సీహెచ్ సురేష్ జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ బుధవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మీఠ్యాతండాలో 2016 సంవత్సరంలో తండాకు చెందిన గుగులోతు వీరన్న, వడివేలు సర్వనన్ అనే వ్యక్తి మధ్య భూవివాదంపై గొడవ జరిగింది. ఈ విషయంలో తనపై వీరన్న గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడ్డారని సర్వనన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జి.రాజుకుమార్ కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సీహెచ్ సురేష్ కేసులోని సాక్షులను విచారించిన అనంతరం నిందితుడు వీరన్నకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

దివ్యాంగులకు మరింత 'ఆసరా'


దివ్యాంగుడికి పింఛన్ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో కలెక్టర్ శశాంక

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం.. దివ్యాంగులకు ఆసరా పింఛన్ పెంచి ఆదుకుంటోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో దివ్యాంగులకు ఆసరా పింఛన్ల పెంపు పత్రాలు అందజేశారు. కలెక్టర్ కె. శశాంకతో కలిసి పలువురికి పెంచిన పింఛన్ల మొత్తాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మానవీయ దృక్పథంతో దివ్యాంగులకు పింఛన్‌ను రూ.3016 నుంచి రూ.4016కు పెంచి ఆదుకుంటున్నారని తెలిపారు. 2014కు ముందు రూ.500 పింఛన్ మాత్రమే అందేదని..తొమ్మిదేండ్లలో ఎనిమిదింతలు పెరిగిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఇస్తున్న పింఛన్లు మరే రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి పింఛన్లు అందుతున్నాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా తెలంగాణలో ఇస్తున్న పింఛన్లు అమలు కావడం లేదన్నారు. వృద్ధాప్య పింఛన్ వయసును 2020 మార్చిలో 60 ఏండ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. అనంతరం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయగా దీని నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, తొర్రూరు, పెద్దవంగర ఎంపీపీలు చిన్న అంజయ్య, రాజేశ్వరి, జెడ్పీటీసీలు శ్రీనివాస్, జ్యోతిర్మయి, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ మాటలన్నీ అబద్ధాలే


మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

- సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్

హన్మకొండ: సీఎం కేసీఆర్.. పూటకో మాట మాట్లాడుతారని, అవీ అబద్ధాలే చెబుతారని ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ విమర్శించారు. తమకు ఉద్యోగభద్రత కల్పిస్తూ, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 8వ రోజుకు చేరుకుంది. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కువద్ద చేపట్టిన దీక్షలో భాగంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్.. కరోనా సమయంలో ఏఎన్‌ఎంలను దేవుళ్లతో పోల్చారని, ఇప్పుడు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ వస్తే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేస్తామని చెప్పి.. నేడు మాట తప్పుతున్నారని మండిపడ్డారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ఉపాధ్యక్షులు యాకోబు, విక్టోరియా, సుమలత, నాయకురాళ్లు సుజాత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వృద్ధుడి దారుణ హత్య

- భార్య కళ్ల ఎదుటే కత్తితో గొంతుకోసిన దుండగులు
- భూ వివాదమే హత్యకు కారణమంటున్న మృతుడి బంధువులు
- వరంగల్ నగరంలో ఘటన


రాంచందర్ (ఫైల్)


రాంచందర్ మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య, కుమార్తె, కుమారులు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఎస్‌ఆర్‌ఆర్‌తోటలో బుధవారం ఉదయం ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి భార్య కళ్లెదుటే వృద్ధుడిని కత్తితో గొంతు కోసి పరారయ్యారు. భూ వివాదమే హత్యకు కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడి బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. ఎస్‌ఆర్‌ఆర్‌తోటకు చెందిన నాము తాబాజీ రాధాబాయ్, రాంచందర్(65) దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాంచందర్ ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహించి రిటైరయ్యారు. పదేళ్ల క్రితమే ఎస్‌ఆర్‌ఆర్‌తోటలో ఇల్లు కట్టుకొని స్థిరపడ్డారు. పిల్లలకు పెళ్లిళ్లై వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. ప్రస్తుతం రాధాబాయ్, రాంచందర్ మాత్రమే ఎస్‌ఆర్ ఆర్‌తోటలోని ఇంట్లో నివాసం ఉంటున్నారు. రాంచందర్‌కు పరకాల నియోజవర్గం పత్తిపాక శాయంపేట గ్రామంలో 1.20గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి విషయమై స్థానికుడి నడమ వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం సుమారు 11.20 నిమిషాలకు గుర్తు తెలియని వ్యక్తులు ఎస్‌ఆర్‌తోటలో రాంచందర్ పేరు పెట్టి పిలుస్తూ ఇంట్లోకి ప్రవేశించారు. ఎవరో వచ్చారు అని భార్య రాధాబాయ్ చెప్పగానే బెడ్రూం నుంచి హాల్‌లోకి ప్రవేశించిన రాంచందర్‌ను దుండగులు కింద పడేసి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోసి పరారయ్యారు. ఆ దృశ్యం చూసిన భార్య షాక్‌కు గురైంది. రక్షించండి అంటూ రాంచందర్ ఇంట్లోనుంచి రోడ్డుపైకి చేరి రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే చనిపోయాడు. విషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్.. ఎస్సై శ్రీలత, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు నాము తాబాజీ ప్రదీప్ చందర్ మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్యా నేరం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ తెలిపారు.

భూ వివాదమే హత్యకు కారణమా..?

వృద్ధుడి హత్య అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. ఎవరితోనైనా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా..? పాత కక్షలు ఏమైనా ఉన్నాయా..? పత్తిపాక శాయంపేటలోని 1.20 గంటల భూ వివాదమే హత్యకు కారణమా..? భూ వివాదంపై పట్టు వీడడం లేదనే కక్షతో గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేసి ఉంటారా..? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. పత్తిపాక శాయంపేటకు చెందిన ఓ వ్యక్తికి రాంచందర్ నడమ భూవివాదం ఉందని, మృతుడి కుమారుడు ప్రదీప్ చందర్ చెప్పడంతో సదరు వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. హత్య చేసి పరారైన వ్యక్తులు ముందుగా ఎక్కడినుంచి ఇంటికి చేరుకున్నారు..? ఆ తరువాత ఏ దారిలో వెళ్లి ఉంటారు..? అనే దానిపై సీసీ పుటేజీలను సైతం పరిశీలించినట్లు తెలిసింది.

పంట రుణం చెల్లించలేదని..

- రైతుబంధు నగదు ఇవ్వని బ్యాంకు అధికారులు


రైతుబంధు నగదు ఇప్పించాలని వేడుకుంటున్న ఈరమ్మ, ఆమె కుమారుడు సంతోష్

బయ్యారం: పంట రుణం చెల్లించలేదని నెపంతో ఓ మహిళా రైతుకు బ్యాంకు అధికారులు రైతుబంధు నగదును నిలిపివేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో జరిగింది. మండలంలోని గురిమెళ్లకు చెందిన మహిళారైతు గుగులోత్ ఈరమ్మకు ఏడు ఎకరాల పోడుభూమి ఉంది. 2007లో ఈరమ్మ బయ్యారంలోని అప్పటి ఆంధ్రాబ్యాంకు ప్రస్తుత యూనియన్ బ్యాంకులో రూ.50వేల పంట రుణం తీసుకుంది. ఆ తరువాత పోడుభూములకు రెవెన్యూ అధికారులు పహాణీలు ఇవ్వడం నిలిపివేశారు. దీంతో బ్యాంకులో రుణం రెన్యువల్ కాకుండా నిలిచింది. ఇటీవల ప్రభుత్వం పోడు పట్టాలు ఇవ్వడంతోపాటు రైతుబంధు నిధులు జమచేయడంతో సదరు మహిళా రైతు రైతుబంధు నగదు తీసుకునేందుకు కుమారుడు సంతోష్‌తో కలిసి బుధవారం బ్యాంకు వద్దకు వచ్చింది. అయితే బ్యాంకులో పంట రుణం చెల్లించలేదని, రైతుబంధు డబ్బులు ఇవ్వమని అధికారులు తెలపడంతో ఆందోళనకు గురైంది. రైతుబంధు డబ్బులు పెట్టుబడికి అవసరం అవుతాయనుకుంటే బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదని, తనకు డబ్బులు ఇప్పించాలని అధికారులను వేడుకుంది. కాగా, ఈ విషయంపై బ్యాంకు అధికారులను సంప్రదించగా మేనేజర్ అందుబాటులో లేరని, ఆయన వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

బీసీలను వంచిస్తున్న పార్టీలు

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్


బీసీ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్: బీసీ కులాలను రాజకీయ పార్టీలు వంచిస్తున్నాయని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఆరోపించారు. బుధవారం వరంగల్ ఎల్‌బీనగర్‌లోని డీసెంట్ ఫంక్షన్‌హాల్‌లో ఓరుగల్లు బీసీ రాజ్యాధికార గర్జన ఆహ్వాన కమిటీ చైర్మన్ ధర్మపురి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీఆర్‌ఎస్ ప్రకటించిన జాబితాలో పరిగణించకపోవడం, పద్మశాలీలను కేవలం ఒకే స్థానానికి పరిమితం చేయడం, విశ్వబ్రాహ్మణ, పెరిక, నాయీ బ్రాహ్మణ, కురుమ, కుమ్మరి వర్గాలకు ఏమాత్రం ప్రాతినిత్యం కల్పించకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఆగస్టు 27న వరంగల్‌లో జరిగే బీసీ రాజ్యాధికార గర్జనలో అన్ని కులాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈగర్జలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుగేందర్‌యాదవ్, కేడల ప్రసాద్, చేపూరి ఓదెలు, ఆడేపు నగేష్‌నేత, చింతాల అనిల్, అల్లాడి యాకయ్య, కీర్తి జయంతి, సాంబరాజు ప్రభాకర్, కడారి రవి, పరిమళ లక్ష్మణ్, సదానందం, మడత కిశోర్, యాదగిరి, గీసబోయిన ఆకాష్, బేతి రమేష్, బేతి రాజు, సట్ల సాయి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దాతలూ.. ఆర్థిక చేయూతనందించండి

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి వేడుకోలు


సంగీత

చిల్పూరు: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన ఓ క్రీడాకారిణి.. తనకు దాతలు ఆర్థిక చేయూతనందించాలని వేడుకుంటోంది. మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన దూడల సంగీత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంది. అక్కడ ప్రతిభకనబరిచి అక్టోబర్ 5నుంచి 7వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే పోటీలకు రాష్ట్రం తరుపున ఎంపికైంది. అయితే పోటీలకు వెళ్లడానికి తనకు ఆర్థిక స్థోమత లేదని, దీనిపై దాతలు స్పందించి సాయం చేయాలని సంగీత కోరారు. సాయం చేయాలనుకునే వారు పీఈటీ వంశీ కృష్ణ 9000266996 నంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా చేయూతనందించాలని కోరారు.

పేదింటి విద్యా కుసుమానికి ఎంబీబీఎస్ సీటు


మెడికల్ సీట్లు సాధించిన అక్కాచెల్లెళ్లు

నయీంనగర్: ఓ పేదింటి విద్యార్థిని నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందింది. హనుమకొండ పోచమ్మకుంటకు చెందిన జనగాం సురేష్, కవిత దంపతుల కూతురు హరిప్రియ.. కన్వీనర్ కోటాలో భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. గతంలో హరిప్రియ సోదరి జనగాం శరణ్యప్రియ కూడా కన్వీనర్ కోటాలోనే కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడం విశేషం. ఒకే కుటుంబంలో అక్కాచెల్లెళ్లు ఎంబీబీఎస్ సీటు సాధించడంతో వారిని పలువురు అభినందించారు. కాగా, హనుమకొండ హనుమాన్‌నగర్ డబ్బాల సెంటర్‌లో చిన్న దుకాణం నడుపుకుంటూ ఇద్దరు కూతుళ్లను ఉన్నతంగా చదివిస్తున్న సురేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

- కడియం సభకు వస్తుండగా ఘటన..


కొమురమ్మ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక పాత రైల్వే గేట్ సమీపంలో కాలినడకన రైల్వే ట్రాక్‌ను దాటుతున్న ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని రైలు ఢీకొట్టగా ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఐనవోలు మండలం గర్మిళ్లపల్లికి చెందిన పిడుగు కొమురమ్మ(60) బుధవారం డివిజన్‌కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సభకు వచ్చింది. కాగా, ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలకు కలిపేలా ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జి పూర్తయి వినియోగంలోకి రాగా కొద్ది నెలల క్రితం రైల్వేగేటు పూర్తిగా మూసివేశారు. అయితే పాదాచారులు పాత గేటు మార్గం గుండా వెళ్తున్నారు. ఈ క్రమంలో కొమురమ్మ పాతగేటు వద్ద నుంచి రైల్వేట్రాక్ దాటుతుండగా సికింద్రాబాద్ నుంచి ఖాజీపేటకు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై పరశురాములు తెలిపారు.

ఇద్దరు లారీ డ్రైవర్ల అరెస్ట్

- యజమానిపై కేసు నమోదు

వర్ధన్నపేట: లారీ.. ఆటోను ఢీకొన్న ఘటనలో ఆరుగురి మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన ఇద్దరు లారీ డ్రైవర్లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని వర్ధన్నపేట ఏసీపీ సురేష్ తెలిపారు. ఈ నెల 16వ తేదీన మండలంలోని ఇల్లంద గ్రామంలో లారీ.. ఆటోను ఢీకొనడంతో ఆరుగురు మృతి చెందారన్నారు. ఆ సమయంలో లారీ నడిపిన డ్రైవర్ మదన్‌లాల్ నాయక్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేదు. మరో డ్రైవర్ రాజేష్ మీనన్‌కు ఉన్నా గడువు తేదీ ముగిసిందన్నారు. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే, లారీ యజమాని కన్యాలాల్‌పై కూడా కేసు నమోదు చేశామని, ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నారని ఏసీపీ సురేష్ పేర్కొన్నారు.